ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 18-06-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు సచివాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది.

2. ప్రముఖ IT దిగ్గజ సంస్థ గూగుల్ కంపెనీ హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ( GSEC) ని ముఖ్యమంత్రి A. రేవంత్ రెడ్డి ఈ ఉదయం ప్రారంభించారు.

3. దీర్ఘకాలంగా ఉన్న ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులు ఆదేశించారు.

4. రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని పలు జిల్లాకు వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**అఖిల పక్షం-బనకచర్ల**

గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టులో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించేందుకు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు అఖిలా పక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఈ సాయంత్రం నిర్వహించే సమావేశానికి రాష్ట్రానికి చెందిన వివిధ పార్టీల లోక్‌సభ , రాజ్యసభ సభ్యులను ఆహ్వానించారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఊతం కుమార్ రెడ్డి ఈ మేరకు BJP, కాంగ్రెసు, BRS, MIM పార్లమెంటు సభ్యులను ఆహ్వానిస్తూ , లేఖలు పంపారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్ కుమార్ సహా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు సభ్యులందరికీ ప్రభుత్వం ఆహ్వానం పంపింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజల జలహక్కులకు భంగం కలిగించవచ్చని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టు వల్ల రాష్ట్రానికి కలిగే నష్టాలపై ఈ సమావేశంలో మంత్రి పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ఇవ్వనున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ఈ సమావేశంలో ఎంపీలతో చర్చించి వారి సలహాలు, సూచనలు కోరనున్నట్లు మంత్రి తెలిపారు.

NSD

**CM-గూగుల్:**

ప్రముఖ IT దిగ్గజ సంస్థ గూగుల్ కంపెనీ హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ( GSEC) ని ముఖ్యమంత్రి A. రేవంత్ రెడ్డి ఈ ఉదయం

ప్రారంభించారు. రాష్ట్ర IT శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , గూగుల్ సంస్థ ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. IT మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, అత్యాధునిక G-సెక్ ఏర్పాటుతో, హైదరాబాద్ మరో కీలక సంస్థకు స్థావరంగా మారిందని అన్నారు. ఇలాంటి సంస్థ ఆసియా పసిఫిక్ లోనే మొట్టమొదటిదనీ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని కొన్ని శక్తులు దుర్వినియోగం చేస్తోందనీ , ఇలాంటి దుర్వినియోగాన్ని నివారించటంలో అత్యాధునిక పరిజ్ఞానాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. తక్కువ ఖర్చుతో లభించే నైపుణ్యం వనరులు ఒకప్పుడు చాలా కంపెనీలను రాష్ట్రానికి రప్పించాయనీ , కానీ ప్రస్తుతం ఇప్పుడు విలువ ఆధారిత నైపుణ్యం వల్ల పలు కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయనీ చెప్పారు.

---MSL

**మంత్రులతో ముఖాముఖీ:**

దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నాంపల్లి లోని కాంగ్రెసు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మంత్రులతో ముఖాముఖీ కార్యక్రమంలో నాగేశ్వరరావు ఈ ఉదయం పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ... ప్రజల నుండి 50 పైగా వినతులు ఈ రోజు అందయన్నారు. ఎక్కువ భాగం పెద ప్రజల సమస్యలే అందులో ఉన్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్లు సహా పలువురు ఉన్నతాధికారులతో మాట్లాడి , పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేలా సూచనలు చేసినట్లు చెప్పారు.

(MSL)

**కేటీఆర్-సిరిసిల్ల**

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో పోలీస్ స్టేషన్లు సెటిల్‌మెంట్లు చేసుకునే ప్రదేశాలుగా మారిపోయాయని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారక రామారావు విమర్శించారు. పోలీసులు , అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పినట్లే చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా , తంగళ్ళపల్లి మండలం, అంకుసాపూర్ గ్రామానికి చెందిన చెందిన మాజీ ఎంపీటీసీ కరిక వేణి కుంటయ్య ఆత్మహత్యకు పాల్పడడంతో ఈరోజు సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ... తనకు అన్యాయం జరిగిందని కుంటయ్య ఫిర్యాదు చేస్తే పోలీసులు ఆయనపైనే తిరిగి కేసు పెట్టారని విమర్శించారు.

(పీటీసీ, సిరిసిల్ల)

**మంత్రి గడ్డం వివేక్**

రాష్ట్ర మంత్రిగా గడ్డం వివేక్ వెంకట స్వామి హైదరాబాద్ లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. కార్మిక , గనుల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

DESK

**ఇరాన్-ఇజ్రాయెల్ హెల్ప్ లైన్ నంబర్లు**

ఇరాన్-ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో , ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులకు సహాయం అందించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్లో ప్రత్యేక హెల్ప్ లైన్ను ప్రారంభించింది. సహాయం కోసం ప్రజలు 98719 99044, 9643723157, 9910014749, 9949351270 నంబర్ల కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

PN

**బ్రేక్**

**గో సంరక్షణ సీఎం**

రాష్ట్రంలో గోవుల సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్8ధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ ఈ విషయంలో లోతైన అధ్యయనం చేయాలని ఆదేశించారు.

(డెస్క్)

**నకిలీ ఓటర్లు సీఈవో**

రాష్ట్రంలో ఇప్పటి వరకు 59 వేల 390 డూప్లికేట్ ఎపిక్ కార్డులను గుర్తించినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇందులో 29 వేల 153 నకిలీ కార్డులను ఓటర్ల జాబితా నుంచి ఇప్పటికే తొలగించినట్లు ఆయన వెల్లడించారు. నకిలీ ఓటర్లలో ఎక్కువ మంది ఆంధ్రప్రదేశ్ , తమిళనాడులలో కూడా ఓటు నమోదు చేసుకున్నవారే ఉన్నారని సీఈవో వివరించారు. చనిపోయిన ఓటర్లను జాబితాల నుంచి తొలగించడానికి కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ నుంచి సమాచారం సేకరిస్తామని కూడా తెలిపారు.

(పీఎస్)

**వాతావరణం**

తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈరోజు, రేపు జయశంకర్ భూపాలపల్లి , ములుగు, భద్రాద్రి కొత్తగూడెం , ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

(డెస్క్)

**యోగా- మహబూబ్ నగర్**

ఈరోజు యాంత్రిక జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి నుంచి ఉపశమనం పొంది , మానసిక ప్రశాంతతను పొందడానికి యోగా ఒక చక్కటి మార్గమని మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ యోగా గురువు హనుమంతు ఆకాశవాణికి తెలియజేస్తూ...

(బైట్ -యోగా గురువు హనుమంతు)

పిటిసి, మహబూబ్ నగర్

**యోగా-ఆకాశవాణి**

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రాంతీయ వార్తా విభాగం, 'యోగా చైతన్యం' పేరిట రేపు ఉదయం 10 గంటలకు ప్రముఖ యోగా గురువు తెలికెపల్లి లక్ష్మీ నరసింహారావుతో ప్రత్యక్ష ఫోన్-ఇన్ కార్యక్రమాన్ని ప్రసారం చేస్తుంది . ఆసక్తి గల శ్రోతలు - 040 29704735 - లేదా - 040 2324 4834 - లేదా - 040 2324 4836 నెంబర్లకు నేరుగా ఫోన్ చేసి, యోగా గురించి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

MSL

**యోగా-సిరిసిల్ల**

యోగా సాధన వల్ల చాలా లాభాలు కలుగుతాయని , శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా ప్రశాంతత పొందవచ్చునని రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రముఖ యోగా గురువు పల్లికొండ గంగాధర్ ఆకాశవాణికి తెలుపుతూ...

(బైట్ యోగా గురువు పల్లికొండ గంగాధర్)

(పీటీసీ, సిరిసిల్ల)

**పాలకుర్తి ఎమ్మెల్యే - యశస్విని**

పల్లెల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమని పాలకుర్తి ఎమ్మెల్యే  మామిడాల యశస్విని రెడ్డి  అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని  వావిలాల, మల్లంపల్లి, దర్దపల్లి గ్రామాల్లో సీసీ రోడ్లు , డ్రైనేజీ పనులకు ఈరోజు శంకుస్థాపన చేశారు. పల్లెలు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అన్నారు.

(పీటీసీ, జనగామ)

**బేగంపేట-ఎయిర్ పోర్ట్**

హైదరాబాద్ లోని బేగంపేట విమానాశ్రయానికి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో సైబర్ క్రైమ్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. మెయిల్ అందిన వెంటనే అప్రమత్తమైన రాష్ట్ర స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్- సీఐఎస్ఎఫ్, ఇతర భద్రతా బలగాలు హుటాహుటిన విమానాశ్రయానికి తరలి వెళ్లారు.

(పీఎన్)